1993
నుండి
వెలువడుతున్నది

ఎలమి : ముంగానాపి
(నందన : భాద్రపదం)

సెప్టెంబరు 2012

తెలుగుజాతి పత్రిక

# నడుస్తున్న చరిత్ర

• నుడి • నాడు • నెనరు

15 రూ.



సామల సదాశివ



భద్రిరాజు కృష్ణమూర్తి



వి.వి. కృష్ణశాస్త్రి



కొండపల్లి శేషగిరిరావు



వెంపటి చినసత్యం



కాపు రాజయ్య



జువ్వాడి గౌతంరావు

- ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ
- 'తాపీ': ఖరీదుకట్టే షరాబులెవ్వరు?
- చెంచు బతుకు కత: పులిచెర్ల పోతా కొర్రల్ కొర్రల్
- తెలుగు భాషోద్యమ వార్తలు
- ముత్యాలసరాలు... గుఱజాడకు ముందే ఉన్నై
- మాండలిక కత: మాతమ్మ మళ్ళీ రాదా?

## చదువరులతో ఒకమాట....



**ఎస్.పి.వై.రెడ్డి, బి.ఇ.,**
**భారత పార్లమెంటు సభ్యులు**
**నంది సంస్థల అధినేత, నంద్యాల.**
**నడుస్తున్న చరిత్ర పోషకులు**

మొత్తంమీద మన జలవనరుల నిర్వహణ, విద్యుత్ రంగ నిర్వహణ విఫలం అయిందనే చెప్పుకోవాలి. వాతావరణంలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకొంటూ, పెరుగుతున్న అవసరాలను దృష్టిలోపెట్టుకొని సుదీర్ఘ ప్రణాళికతో నిర్వహించవలసిన ఈ రెండు రంగాల్లో ఇంతకాలంగా ప్రభుత్వాలన్నీ విఫలం అయ్యాయని అనుకుంటేనే నిజాన్ని ఒప్పుకొన్నట్లవుతుంది. పైగా యీ రెండు రంగాలకు పరస్పర సంబంధంతోపాటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల నిర్వహణ మొత్తం ఆధారపడి ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా వాటివల్ల ఎంతవరకు మనం ప్రయోజనం పొందగలిగాం? విద్యుత్, జలవనరుల నిర్వహణ రంగాల్లో ఇంతటి వైఫల్యాలకు కారణాలు ఏమిటి? ప్రణాళికలు, వ్యూహాలు తప్పుదారి పట్టినవా - లేక- వాటి అమలులో లోటుపాట్లు, అతిక్రమణలు జరిగాయా? ఇప్పటికైనా మనం మేలుకొని భౌగోళిక, పర్యావరణ వాస్తవాలను, అవసరాలను దృష్టిలో ఉంచుకొని పునరాలోచించవలసిన సమయం వచ్చేసింది. పొరుగు రాష్ట్రాలనో, ప్రకృతినో తప్పుపట్టేకంటే - విజ్ఞతతో మన సమస్యలను పరిష్కరించుకోవడం మంచిది.

**ఈ పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.**

భాషా సాంస్కృతిక రంగాల్లో ఒక నెలరోజుల వ్యవధిలో ఇందరు గొప్పవారు మనల్ని వదిలివెళ్లి పోవడంతో తెలుగునేల కన్నీట తడిసింది. మనకు తెలిసిన చరిత్రలో ఇలాంటి దురదృష్టకరమైన పరిస్థితి ఎన్నడూ ఏర్పడలేదు.




## లోపలి పుటలలో....


| | | |
|---|---|---|
| **వారసత్వ సంపద :** అంత పెద్ద వినాయకుడికి .... | ఈమని శివనాగిరెడ్డి | 2 |
| **సంపాదక హృదయం :** పాలకవర్గాలు జవాబు చెప్పాలి | | 7 |
| **చూపు :** దేశీయ తెలుగు మూలాలను... | జయధీర్ తిరుమలరావు | 9 |
| తెలుగుసిరి : భాషాశాస్త్ర ధ్రువతార భద్రిరాజు | ఆర్వీయస్. సుందరం | 12 |
| నివాళి : తెలుగు జాతి ఉనికికి... కృష్ణశాస్త్రి | జి.వి.పూర్ణచంద్ | 14 |
| నివాళి : సంగీత సాహిత్య సదాశివత్వం | జి. బాలశ్రీనివాసమూర్తి | 16 |
| నివాళి : సంగీత సాహిత్య సుగంధాల మూట | గూడూరు మనోజ | 19 |
| **చెంచుబతుకు కత :** పులిచెర్ల పోతా కొర్రల్.. కొర్రల్ | భూమని రవీంద్ర | 21 |
| ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ | తెలుగు భాషోద్యమ సమాఖ్య | 23 |
| ఉద్యమానికి పిలుపు, సూచనలు | తెలుగు భాషోద్యమ సమాఖ్య | 25 |
| **ఉద్యమ వార్తలు** | | 27 |
| ముత్యాల సరాలవంటి గేయాలు గురజాడకు ముందే | పరిమి రామనరసింహం | 29 |
| **గురజాడ :** దీపధారి | వేదగిరి రాంబాబు | 32 |
| **స్పందన :** | | 33 |
| **తాపీ :** ఖరీదు కట్టే షరాబు లేవరు? | నాగసూరి వేణుగోపాల్ | 35 |
| మన విశ్వవిద్యాలయాలు - పాశ్చాత్య ... | కృష్ణకుమార్ | 39 |
| **చిత్తూరు కత :** మాతమ్మ మళ్ళీ రాదా... | రాపూరి రంగనాయకులు | 41 |
| నివాళి : కనుమరుగైన ఇద్దరు చిత్రకళావేత్తలు | సంకేపల్లి నాగేంద్రశర్మ | 44 |
| నివాళి : ప్రాతఃస్మరణీయుడు - వెంపటి | సప్పా దుర్గా ప్రసాద్ | 45 |
| **వక్కాణం :** న్యాయం అంగట్లో కొనుగోలు వస్తువా.. | చలసాని నరేంద్ర | 46 |
| పాపన్న విగ్రహావిష్కరణ | | **47** |
| **తెలుగు దేశ చరిత్రకారులు :** ఇంగువ కార్తికేయ శర్మ | జి. వెంకటేశ్వరరావు | 49 |
| **తందానతాన :** గరిగాట | పూతలపట్టు రఘునాథరెడ్డి | 51 |


కవితలు: వెలుగు వెంకట సుబ్బారావు, నిఖిలేశ్వర్,
దామెర్ల రాములు కె. గౌతమ్, గుబ్బాల రమణయ్య

పకపకలు: శేఖర్, ఎ.వి.ఎమ్., పాండురంగ   బొమ్మలు : పుట్టా పెంచల్దాస్

క్రైసేత : లావేటి త్రివేణి, షాకీరా

సంపాదకుడు : **డా॥ సామల రమేష్‌బాబు**

**నడుస్తున్న చరిత్ర**, జి-2, శ్రీవాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520004. *e-mails:* ncharithra@rediffmail.com   ncharithra@gmail.com
దూరవాణి: (కార్యాలయం) *0866 - 2439466*   సంపాదకుడు : *98480 16136*

రచయితలకు విజ్ఞప్తి : మీ రచనలతోపాటు, హామీ పత్రాన్ని తప్పక జతపరచాలి. ఆ రచన ఏ ఇతర పత్రిక పరిశీలనలోనూ లేదనీ కేవలం నడుస్తున్నచరిత్రలో ప్రచురణకు మాత్రమే పంపుతున్నామని హామీ పత్రంలో వ్రాయాలి. మీ పేరు, పూర్తి చిరునామా, ఫోను నెంబరు తెలియపరచాలి.

సంపాదకీయం

# పాలకవర్గాలు జవాబు చెప్పాలి

ఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవంనాడు కర్నూలులో మొదటి తరగతి న్యాయమూర్తి ఎన్. శ్రీనివాసరావు ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన తీర్పును తెలుగులో ఇచ్చి న్యాయమూర్తులకు ఆదర్శంగా నిలబడ్డారు. 2006లో ఇదే సందర్భంగా గుంటూరు జిల్లా కోర్టు ముఖ్య న్యాయమూర్తి ఆదిత్య ప్రతాప్ భాంజదేవ్ తీర్పులనిచ్చారు. నిజామాబాద్‌జిల్లా కోర్టులో ముంగారి రాజేందర్ (జింబో) తెలుగులో తీర్పులనివ్వడంలో ముందు వరుసలో ఉన్నారు. ఇదే స్ఫూర్తితో అక్కడక్కడా తెలుగులో తీర్పులు వచ్చినా, అందుకు ఇటు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని, అటు న్యాయవాదులు సహకారాన్ని అందించకపోవడంతో ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. నిజానికి - తెలుగులో తీర్పులు ఇవ్వాలని చట్టాలున్నాయి. కింది కోర్టులలో తెలుగును వాడాలని 1974 మార్చిలోనే జి.ఒ.485 ఉన్నది. ఇందుకు సంబంధించి 1981లో ప్రభుత్వం శాసనపరంగా మళ్లీ ఉత్తర్వులిచ్చింది. ఆ ఉత్తర్వు ఆధారంగా రాష్ట్రహైకోర్టు రెండుసార్లు కింది స్థాయి కోర్టులను మందలించింది. న్యాయశాఖ అధికారులు హైకోర్టు రిజిస్ట్రారుతో చర్చలు జరపడం, మళ్లీ ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు కాలం దొర్లిపోతున్నదేగానీ, అడుగు ముందుకు పడలేదు. ఇప్పుడు కర్నూలులోని యువ న్యాయమూర్తి తెలుగులో తీర్పు ఇచ్చి మళ్లీ కదలిక తెచ్చారు. ఆయనను తెలుగుజాతి అంతా అభినందిస్తున్నది.

అసలు ఈ రాష్ట్రంలో తెలుగులో పరిపాలన జరుగుతున్నదా? అనే ప్రశ్న మన ముందు తాండవిస్తున్నది. రవిచంద్ర, రాయుడుగార్లవంటి జిల్లా కలెక్టర్లున్నచోట జిల్లాస్థాయిలో తెలుగు పూర్తిగా అమలులోకొచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. ఎన్టీ రామారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1988 ఏప్రిల్ 2 (ఉగాది) నుండి ఆంగ్లంలో ఏఫైలునూ చూడనని భీష్మించుకొని, స్వయంగా పూనుకొన్న తర్వాత ఆయన పాలనా కాలంలో సచివాలయ స్థాయి నుండి తెలుగు అమలు నియమబద్ధంగా అమలు జరిగింది. ఆయన తర్వాత కథ మళ్లీ మామూలే. జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి తలచుకొంటేనే అధికార భాషగా తెలుగు అమలు జరిగిందనే వాస్తవం తెల్లం చేస్తున్న సంగతి ఒకటే - అధికారంలో కీలక స్థానంలో ఉన్నవారు తలచుకొంటేనే చట్టాలు అమలవుతాయని! 1966లో అధికార భాషా చట్టం పుట్టింది. ఆ తర్వాత దానికి 1988లో జి.ఒ.ఎం.ఎస్.నెం. 587, 2005లో జి.ఒ.నెం. 420 తోడై అధికారభాషగా తెలుగు అమలు గురించి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. ఇంతకంటే ఎక్కువ ఏమీ అక్కరలేదన్నంత బాగా మనకు చట్టాలున్నా అవి అమలు జరగడం లేదు. ఇందుకు ఆయా ముఖ్యమంత్రులూ, వారి మంత్రివర్గసభ్యులూ, సచివాలయ అధికారులూ బాధ్యులు కాదా? ప్రభుత్వాలకు నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రులు గాని, పాలక - ప్రతిపక్షాల్లో ఉన్న నాయకులు గాని ఈ అంశంపై నోరు విప్పరెందుకని?

అధికార భాషగా తెలుగు అమలును పర్యవేక్షించడానికి అధికార భాషా సంఘం అంటూ గోళ్లూ, పళ్లూ లేని దిక్కుమాలిన సంఘం ఒకటి 50 ఏళ్లుగా ఉంది. దాని అధ్యక్షుణ్ణీ, నలుగురు సభ్యులనూ రెండేళ్లకొకసారి నియమిస్తారు. వాళ్లు ఏడాదికొకసారో రెండుసార్లో జిల్లా కేంద్రాలను పర్యటించి, రాష్ట్ర ముఖ్యమంత్రికి తమ నివేదికలను, సలహాలను ఇవ్వడం తప్ప చేయగలిగిందేమీ లేదు. ఈ సంఘాన్నొక కాలక్షేపపు తంతుగా ప్రభుత్వ అధినేతలే మార్చి వేశారు. వావిలాల, నండూరి, ఎ.బి.కె. ప్రసాద్ వంటి ముగ్గురు నలుగురు తమ శాయశక్తులా పనిచేసి కొంత చైతన్యాన్ని తెచ్చినా వారి కృషి అంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది. మూడేళ్ళుగా ఆ సంఘాన్నీ మూతవేసి ఉంచారు. ఇందుకు కారణం ప్రభుత్వనేతల్లో రాజకీయ సంకల్పం లేకపోవడమే, చిత్తశుద్ధి ఏ మాత్రమూ లేకపోవడమే.

పరిపాలన నిరంతరం పట్టుగా సాగాల్సిన అంశం. ఏ అంశంలోనైనా పట్టుసడలితే అంతా విచ్ఛిన్నమే. సామాన్య ప్రజలకు పరిపాలన అందుబాటులో లేకుండా పోతుంది. పరాయి పాలన పోయి మన సొంత ఏలుబడిలోకొచ్చినా, దొరలపెత్తనం నశించి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు దొరతనానికొచ్చినా, పరాయి భాషలోనే అన్ని మట్టుల్లో (స్థాయిల్లో) పాలన జరగడం ఏమిటి? ప్రజలకు అర్థంకాని భాషలో పాలన జరిగితే ప్రజలు ప్రశ్నించే హక్కును పూర్తిగా

## సంపాదకీయం

ఉపయోగించుకోలేరు. కోర్టులో తన న్యాయవాది తన కేసునే వాదిస్తున్నాడో, ఎదుటి పక్షం వారి తరఫున వాదిస్తున్నాడో ఫిర్యాదుదారునికి తెలియదు. తనకు ఏ శిక్షపడిందో కూడా న్యాయవాది చెప్పేదాకా తెలియదు. అడుగడుగునా న్యాయస్థానాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, పీకల దాకా కూరుకుపోయిన అవినీతి! ప్రజల భాషని అన్ని దశల్లోనూ లేకుండా చేస్తే సాధారణ ప్రజల నోటిని వీలైనంతగా నొక్కివేయవచ్చు. ఇదేనా పాలకుల ఎత్తుగడ?

విద్యారంగంలో తెలుగు పరిస్థితి దయనీయంగా ఉంది. బోధనా మాధ్యమంగా డిగ్రీ స్థాయివరకు ఎదిగిన తెలుగును ఇప్పుడు ప్రాథమిక విద్యకు కూడా పనికిరానిదిగా త్రొక్కివేశారు. ఒక సబ్జెక్టుగా తెలుగు బోధనను పాఠశాలవరకే పరిమితం చేసి, దాన్నికూడా బలహీనంగా, రోగిష్టిగా చేస్తున్నారు. తెలుగు చదువుకొంటే బ్రతుకుతెరువు దొరకదని భయాన్ని కలిగిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను కూడా తెలుగు చదువుకొన్న వారికి అందకుండా చేస్తున్నారు.

తెలుగుకోసం ఉన్న వ్యవస్థలు - విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ వంటివి తమ లక్ష్యాలకు దూరంగా పనిచేస్తున్నాయి. తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఉన్నత విద్యాశాఖ నుండి సాంస్కృతిక శాఖకు బదిలీచేసి, దాని నడుము విరగ్గొట్టారు. ఆ పాపానికి ఒడిగట్టిన వారికి ఏ శిక్ష విధించినా చాలదని విజ్ఞుల అభిప్రాయం. మళ్లీ దాన్నిప్పుడు ఉన్నత విద్యాశాఖకు తిరిగి చేర్చారు. ఆ కారణంగా బడ్జెట్ కేటాయింపులు సరియైన సమయంలో జరగక, జీతాలకు డబ్బులేని పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి తుగ్లక్ పనులకు కారణం ఏమిటి?

మనతోపాటే భాషా ప్రాతిపదికన ఏర్పడిన పొరుగు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలను ఆదర్శంగా తీసుకొని వారు తమ భాషల అభివృద్ధికై ఎటువంటి వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకొన్నారో, ఎలాంటి కృషి చేస్తున్నారో తెలుసుకొని, వారిని మక్కికి మక్కీ అనుకరించినా, మనం బాగుపడతాం. ఏ మౌలిక లక్ష్యాలకోసం మనరాష్ట్రం ఏర్పడిందో వాటిని నెరవేర్చుకోగలుగుతాం. సొంతంగా చేతగానప్పుడు పొరుగు వారిని చూసైనా నేర్చుకోవాలి కదా!

ఇప్పుడు మనకు కావలసింది ఎందుకూ పనికిరాని అధికార భాషా సంఘం కాదు. తమిళనాడు, కర్ణాటకల్లో ఉన్నట్లుగా 'తెలుగు అభివృద్ధి సాధికార సంఘం'- తెలుగు డెవెలప్‌మెంట్ అథారిటీ- కావాలి. నిబద్ధత, అంకితభావం, నిపుణత కలిగినవారితో దాన్ని ఏర్పరచాలి. తెలుగుకోసం ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పరచాలి. తెలుగుకు సంబంధించిన అన్ని అంశాలను తెలుగు అభివృద్ధి సాధికార సంఘానికీ, మంత్రిత్వశాఖకూ ముడిపెట్టాలి. తగినన్ని నిధులతో ఈ ఏర్పాట్లు జరగాలి.

మన ముఖ్యమంత్రిగారు యువకులు. క్రమంగా పరిపాలనలో కుదుట పడుతున్నారు. రాష్ట్రం సమైక్యంగా ఉన్నా, రెండుగా చీలిపోయినా, అందరూ తెలుగు ప్రజలేగనుక, ఈ అంశాలు వాయిదా వేయతగ్గవికావు. తెలుగు పరిరక్షణ కోసమే ప్రపంచ తెలుగు మహాసభల్ని జరుపబోతున్నామని ముఖ్యమంత్రి, సాంస్కృతికశాఖమంత్రి ప్రకటిస్తున్నారు. అయితే ఈ మాటను నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరు. చేతల్లో చూపిస్తేనే నమ్మకం కుదురుతుంది. కనీసం ఈ ప్రభుత్వం భాషోద్యమకారుల డిమాండ్లను వెంటనే ఆమోదించి, తగు అధికారిక ప్రకటన చెయ్యాలి. అటువంటిదేమీ లేకుండా - తెలుగు భాషాదినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి, హడావిడిగా తెలుగు భాషాసేవకులకు పురస్కారాల పేర ఉద్యమకారులకు లంచాలివ్వజూపడం మర్యాద కాదు. ప్రభుత్వం ప్రకటించిన 10మంది పురస్కార గ్రహీతలలో ఆరుగురు వాటిని తిరస్కరించడం ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి. అంతేకాదు, ఆ సందర్భంగా భాషోద్యమకారులు సభను కొంతసేపు నిలదీసి, నిరసన ప్రదర్శన చేయడాన్ని గమనించాలి. ప్రపంచ తెలుగు మహాసభలను ప్రశాంతంగా జరపాలంటే తెలుగుకోసం ప్రభుత్వం ఏమి చెయ్యదలచుకొన్నదో స్పష్టమైన ఉత్తర్వులతో ముందుకు రావాలని నేతలు తెలుసుకోవాలి. సభలపెత్తనాన్ని నెత్తికెత్తుకొన్న సాంస్కృతిక మంత్రిత్వశాఖ, సాంస్కృతిక మండలీ ఇందుకు బాధ్యత తీసుకోవాలి.

తెలుగుకు మన రాష్ట్రంలో మంచి రోజులు వస్తాయా? తెలుగుజాతి ఈ ప్రభుత్వాన్ని తనదిగా భావించాలా, వద్దా? ఈ ప్రశ్నలకు పాలకపక్షంతోపాటు ప్రతిపక్షాలు కూడా జవాబు చెప్పాలి.

**05-09-2012**

**ఏ రాష్ట్రంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1190**

* * *

**Read other issues of Nadustunna Charitra @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Nadustunna+Charitra+Magazine&id=60**